
కొత్తగా కలం పట్టిన రచయిత(త్రు)లు మాత్రమే ఈ శీర్షికలో పాల్గొనాలి ఇన్‌లాండ్ కవర్లమీదే తమ కథలను పంపాలి.



## ఇన్‌లాండ్ లెటర్ కథలు

# టెన్షన్

సీలింగ్ ఫ్యాన్ కింద సీరియస్‌గా ఆఫీసు పని చేసుకుంటున్నా, ఫోన్ మ్రోగినప్పుడల్లా ఏదో టెన్షన్. అతనే అయి ఉండవచ్చు... ఎవరతను? కాసేపు ఆలోచన.. ఇలా ఒక్కసారి కాదు, రెండు.. మూడు సార్లు అదే టెన్షన్..

సరిగ్గా నెలరోజుల క్రితం ఎవరో అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. "హలో రాధా గుర్తు పట్టావా?" అన్న ఆ వ్యక్తి కంఠం ఎక్కడా విన్నట్టు లేదు. "నేను నీకు పరిచయస్తుడనే. విజయవాడలో నువ్వూ నేను కలిసి చదువుకున్నాము! నీ ఉద్యోగం... కుటుంబం... అన్నీ... నీ గురించి అన్నీ వివరాలు నాకు తెలుసు...ఓ ఇంకా గుర్తు పట్టలేదా? ఆల్‌రైట్ సరిగ్గా నెల రోజుల తర్వాత మళ్ళీ ఫోన్ చేస్తాను. బాగా ఆలోచించుకో... ఈ సారి ఫోన్ చేసినప్పుడు గుర్తు పట్టాలి సుమా! ఉంటాను.. నెల రోజుల తర్వాత "

అతను పెట్టిన గడువు ఈ రోజుతో ముగుస్తుంది. ఈ రోజు అతను మళ్ళీ ఫోను చేస్తాడా? అనుకున్నట్టుగానే మళ్ళీ ఫోన్ మ్రోగింది. "రాధా మేడం, మీకు ఫోన్" ప్యూన్ పిలుపుతో అదిరిపడి ఫోన్ వద్దకు వెళ్లాను. "హలో!" అదే వాయిస్. అతనడగబోయేది నాకు ముందే తెలుసు అందుకే నేనే అడిగాను "సారీ! మీరెవరో నాకు గుర్తుకు రావడం లేదు. మీరెవరో..." నేనడగబోయే ప్రశ్నకు మధ్యలోనే అడ్డుతగిలి "ఆ ఆఁ! నా పేరు అప్పుడే చెప్తాననుకున్నారా? చెప్పను గాక చెప్పను. మీకు ఇంకో నెల గడువిస్తున్నాను. ఇంకో విషయం మా ఇల్లు మీ ఆఫీసుకు దగ్గరలోనే... గుర్తు పట్టారా? ఇంకా లేదా? మీరు రోజూ ఆఫీసుకు రావడం నేను రోజూ కిటికీలోంచి చూస్తూనే ఉన్నాను. ఇద్దరు పిల్లలైనా మీ అందం ఆవగింజంతైనా తగ్గలేదుసుమండీ! ఆ పర్సనాలిటీ... ఆ ఫ్రొక్చర్..." అతడి మాటలతో అరికాలి మంట నెత్తికెక్కింది. "స్టాపిట్! సభ్యత లేకుండా ఏంటా వాగుడు? అసలెవరు నువ్వు?" గద్దింపుగా పలికిన కంఠ స్వరంతో ఆఫీసు స్టాఫ్ అంతా ఒక్కసారిగా చూసారు. "ఎందుకండీ అంత కోపం, నా పేరు చెప్పాలి! అంతేగా, సారీ ఫోన్‌లో పేరు చెప్పేకన్నా మీ ఎదురుగా వచ్చి మిమ్మల్ని సర్ప్రైజ్ చేస్తాను. సాయంత్రం మీరు ఆఫీసు నుంచి బయటకు వచ్చే సరికి నేను మీ ఆఫీసు ముందు ఉంటాను, గుర్తుపడతారేమో చూస్తాను. ఓకే... బై.." అతను ఫోన్ పెట్టాశాడు.

సాయంత్రం ఆరు కాగానే మళ్లీ టెన్షన్. అతనెవరో తెలుసుకోవాలని చకచకా వెళ్ళి ఆఫీసు బయటంతా కలియ చూసింది. అక్కడ ఒకే ఒక వ్యక్తి ఉన్నాడు. అతను తనకు పరిచయస్తుడే. గతంలో తన ఆఫీసులోనే పని చేసి ఇటీవలే రిజైన్ చేసిన వ్యక్తి అతను. ఊహూ... అతను కానేకాడని తెలిసిపోయింది.

సరిగ్గా మళ్లీ నెల రోజులకు అదే వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ఈ సారి చెడామడా దులపాలని అనుకుంది. "సారీ! నేను ఆ రోజు మీ ఎదురుగా వచ్చినా గుర్తు పట్టలేదే?" నవ్వుతూ అన్నాడా వ్యక్తి. ఆ రోజు వచ్చాడా!.. అంటే... ఆ రోజు తను చూసిన ఒకే ఒక వ్యక్తి... అతనా?! కాసేపు ఆశ్చర్యంతో ఉండి పోయినా అతని ప్రవర్తనను ఫోనులోనే నిలదీయడంతో అతను అవాక్కయిపోయాడు. "సారీ రాధ గారూ! మీరు నా గొంతు గుర్తు పట్టగలరేమోనని ట్రై చేశాను. కానీ మీరు గుర్తు పట్టలేదు. సరదాగా ఆట పట్టిద్దామని అలా చేశాను. నా పేరు రవి. నేను మీకు పరిచయస్తుడనే ఆ రోజు నన్ను చూసి హలో అన్నారు. కానీ నన్ను అనుమానించలేక పోయారు. మిమ్మల్ని బాధ పెట్టినందుకు నన్ను క్షమించండి... ఉంటాను" అంటూ ఫోన్ పెట్టాసాడతను.

మనుషుల మనస్తత్వాలను అంచనా వేయడానికి ఆ అనుభవమే పునాది అయింది.

— జి. పద్మావతి.

# కట్నం

సగటు మధ్య తరగతి ఆడపిల్లగా ఈ రోజు జరగబోయే నా పదవ పెళ్లి చూపులకి ముస్తాబవుతున్నాను.



ఇలాంటివి ఇష్టం లేక పోయినా ఇప్పటి వరకూ వచ్చిన తొమ్మిది మందికీ నేనయితే నచ్చాను కానీ నేను ఇచ్చే కట్న కానుకలు నచ్చలేదు. అలా బేరాలాడే వాళ్ల మీద పీకలదాకా కోపం వచ్చినా ఏమీ చెయ్యలేని అసహాయత. ఎప్పట్లా ఈ రోజు నోరు మూసుకోకుండా ఏదో ఒకటి చెయ్యాలని నిర్ణయించుకున్నాను. చెప్పిన టైంకన్నా గంట ఆలస్యంగా వచ్చి, పెట్టినవన్నీ సుష్టుగా తిన్న తరువాత నన్ను నఖశిఖపర్యంతం పరీక్ష చేసిన తరువాత, అసలు సంగతికి వచ్చారు. అసలయితే కట్నం తీసుకోవడం ఇష్టం లేదనే కానీ వాళ్ల అబ్బాయి చదువు కోసం కొన్ని అప్పులు చేశామని అవి తీర్చవలసిన బాధ్యత వాళ్ళ అబ్బాయి మీద ఉంది కాబట్టి కట్నం అడుగుతున్నామన్నారు. తీసుకునే ఉద్దేశ్యం ఉన్నప్పుడు వంకలు చెప్పడానికి చాలా దొరుకుతాయి. అందుకే నేను ధైర్యం చేసి పెళ్లి కొడుకు తండ్రితో ఇలా అన్నాను. "నేను మీకు ఇచ్చే రెండు లక్షల కట్నం కావాలా? లేక నా 30 సంవత్సరాల ప్రభుత్వ జీతం కావాలా? మీరే నిర్ణయించుకోండి. ఈ రెండింటిలో మీకు ఏదో ఒకటి మాత్రమే వస్తుంది. మీరు కట్నం కావాలి అంటున్నారు కాబట్టి మీరడిగిన రెండు లక్షల కట్నం నా జీతం మీద లోను తీసుకుని మీకు ఇస్తాను. తరువాత నా జీతం మీకివ్వను"

ఊహించని నా మాటలకు కొద్ది క్షణాల పాటు అవాక్కయిన వాళ్ళు నవ్వుతూ "మా కాబోయే కోడలు పిల్ల చాలా తెలివైంది సుమండీ, అమ్మాయికి కట్నం ఇవ్వడం ఇష్టం లేనప్పుడు మాకు మాత్రం ఎందుకు? తొందరలోనే ముహుర్తాలు పెట్టుకుందాం" అని వెళ్ళిపోయారు. ఎంతయినా తెలివైన వాళ్ళు కదండీ!

— జీ.వి. లక్ష్మి
న్యూఢిల్లీ.